# తృప్తి

**– శివల పద్మ**

ఆఫీస్‌లో వర్క్ చేస్తున్నాడన్న మాటేగానీ ఆనందరావు మనస్సు ఆ వర్క్ మీద ఎంత మాత్రం లేదు. అలా అని అతగాడేం అన్యమనస్కంగా లేడు. ఆనందంలో తేలిపోతున్నాడు. మనస్సంతా మా చెడ్డ ఎక్సయిటెడ్‌గా ఉంది. థ్రిల్లయిపోతున్నాడు ఒకటే...

మధ్యాహ్నం వరకూ ఎలాగో ఆగి రెండవగానే ఇంటికి ఫోన్ చేసాడు. ఇంటిగలవారి అమ్మాయి భార్యని పిలుచుకు వచ్చింది.

''ఏమైంది? వాళ్ళని దిగబెట్టావా?'' ఆత్రుతగా అడిగాడు.

''ఊహూ.. లేదు...''

''ఏం?'' నీరసం ముంచుకురాగా అడిగాడు.

కిలకిలా నవ్వింది సరళ.

''ఏయ్ దొంగా! నన్నేడ్పిస్తున్నావా? ఇంటికి రానీ నీపని చెప్తాను. ఇంతకీ అంతా రెడీ చేస్తున్నావా?'' గొంతు తగ్గించి అడిగాడు. సిగ్గుగా తల ఊపిన సరళ అది ఫోనని గుర్తొచ్చి ''చేసాను'' అంది.

''వెరీగుడ్... సాయంత్రం ఆరున్నరకల్లా తయారై ఆఫీస్‌కి వచ్చేయ్. ప్రోగ్రామంతా సస్పెన్స్...'' అని చెప్పి ఫోన్ పెట్టేసాడు.

ఆనందరావు సరళలది ఓ మధ్యతరగతి దాంపత్యం. తొందరగా పెళ్ళి అయిపోయింది. అంత తొందరగానూ ఓ ఆడపిల్లకి తండ్రయిపోయాడు. ఆ తర్వాత ఒక మగపిల్లాడు మరో ఆడపిల్ల పుట్టారు. జీతం నిత్యావసరాలకి పిల్లల చదువులకి బొటాబొటీగా సరిపోతుంది. సరదాలు, ముచ్చట్లకి ఏనాడో ఫుల్‌స్టాప్ పెట్టేసారు. కనీసం ఏకాంతం కూడా కరువే. ఆఫీస్‌కి దగ్గరని నగరంలో ఒక బిజీ లొకేషన్‌లో ఇల్లు అద్దెకు తీస్కున్నారు. అద్దె పద్దెనిమిది వందలు, రెండే గదులు, వంటిల్లు.

అంత చిన్న ఇంట్లో అంతో ఇంతో జ్ఞానం వస్తున్న పిల్లలతో ఉంటూ ఇక ఏకాంతం ఏమిటి? సరదాలేమిటి? రొటీన్‌గా ఏదో లైఫ్ గడిచిపోతున్నా ఆ వెలితి ఆనందరావులో తీరటంలేదు. ఇంకా నలభయ్యో పడిలో కూడా పడకముందే కోరికలన్ని చంపేసుకోమంటే ఎక్కడ సాధ్యం అవుతుంది? అలా అని ఏ చిన్న కోరికా తీర్చుకునే అవకాశం లేదు.

రోజంతా ఇంటికీ పిల్లలకీ చేసి అలసి పక్క చేరే ఆమె, ఆఫీస్‌లో చేసాక ఇంటికొచ్చి పిల్లలకి చదువు చెప్పుకుని (ట్యూషన్లు పెట్టే స్తోమత ఎలాగా లేదు) నీరసంగా నడుం వాల్చే అతడు– ఇంక శృంగార రసానికి తావెక్కడ? రోజు రోజుకీ లైఫ్ గానుగెద్దులా తయారవుతోంది అని రోజుకి ముప్పైసార్లు అనుకుంటూ ఉంటాడతను.


అలా అనుకునే తీరిక్కూడా తనకి దొరకదు కనుక– సరళ అనుకోదు.

ఈ నేపథ్యంలో బాగా ఆలోచించి– ఆలోచించి ఒక ప్లాన్ చేసాడు ఆనందరావు. ఒక్క రెండు రోజులు పిల్లల్ని ఊర్లో ఉన్న అత్తవారింటికి పంపిస్తే తనూ సరళా కాస్త హాయి హాయిగా జాలీ జాలీగా గడపొచ్చు కదా! అన్పించి ఆ విషయం భార్యతో అన్నాడు. ఆమెకీ భర్తతో కాస్త ఏకాంతంగా మధురంగా గడపాలన్న కోరిక లోలోన ఉండటం వలన వెంటనే అంగీకరించింది.

దాని ఫలితమే ఈ ఏర్పాటు!

సాయంత్రం ఆఫీసవగానే గేటు బయటకి వచ్చాడు ఆనందరావు. అప్పటికే అక్కడకి వచ్చి ఎదురుచూస్తోంది సరళ. గంజిపట్టి ఇస్త్రీ చేసిన కాటన్ చీర, కాస్త సన్నంగా ఉన్నా పొడుగ్గా ఉన్న జడలో మల్లెపూలతో అందంగా తయారై వచ్చిన





భార్యని మురిపంగా చూసాడు. సరళ కాస్త పొట్టిగా సన్నంగా ఉండటం వలన పదమూడేళ్ళ కూతురున్నా ఇంకా చిన్నదానిలాగే కన్పిస్తుంది.

''ఓహో... దేవిగారు స్మార్ట్‌గా తయారై వచ్చేసారే... వెరీగుడ్.'' అన్నాడు స్టాండ్‌లోనుంచి స్కూటర్ తీస్తూ. నూతన వధువులాగే సిగ్గుపడిందామె.

ముందుగా భార్యని ఆ పక్కనే ఉన్న ఐస్‌క్రీమ్ పార్లర్‌కి తీసుకెళ్లాడు. రెండు కప్పులు బటర్‌స్కాచ్ చెప్పి వచ్చాడు.

ఐస్‌క్రీమ్ బాగానే ఉంది కానీ మరీ ముప్పై రూపాయలా? మూడు రోజులు కూరలు వస్తాయి ఈ డబ్బులుతో అనుకుంది సరళ లోలోన.

పైగా స్పూన్ నోట్లో పెట్టుకోగానే పిల్లలు గుర్తుకు వచ్చారు. ముఖ్యంగా ఆఖరిది. దానికి ఐస్‌క్రీమ్ అంటే ప్రాణం! రోడ్డుమీదకి వచ్చే అతి మామూలు ఐస్‌క్రీమ్ కొనిచ్చినా అపురూపంగా తింటుంది. ఏమిటో పిల్లల్ని వదిలేసి అలా తింటూ ఉంటే గిల్టీగా అన్పించింది. తినబుద్ధి కాలేదు.

వదిలేస్తే భర్త చిన్నబుచ్చుకుంటాడని బలవంతాన తిన్నది. ఆనందరావు ఆలోచనలు అందుకు భిన్నంగా లేవు, కానీ వదిలేస్తే భార్య మూడ్ పాడవుతుందని అతడు తిన్నాడు.

అది అయ్యాక ఇంటికి తీసుకెళ్ళడానికి స్వీట్స్, మంచం మీద చల్లుకోవడానికి కాసిని మల్లెపూలు కొన్నాడు.

''నువ్వేమైనా షాపింగ్ చేసుకుంటావా?'' కాస్త స్టైల్‌గా అడిగాడు. అవునంటుందేమో అని భయపడుతూనే.

''అబ్బే... నాదగ్గర ఏం లేవని ఇప్పుడు హడావుడిగా కొనేసుకోవడానికి? అయినా ఈ సమయాన్ని బజారుల్లో ఎందుకు వేస్ట్ చేయడం? అలా పోయి ఏ పార్కులోనైనా కూర్చుందాం పదండి...'' అంది సరళ. షాపులు చూస్తే ఏవైనా కొనాలని అన్పిస్తుంది– అనవసర ఖర్చులు పెట్టాల్సి వస్తుందని ఆమె భయం.

ఇద్దరూ పార్కులో కూర్చున్నారు. దూరంగా పిల్లలు కేరింతలు కొడుతూ జారుడుబల్ల జారుతున్నారు. కొందరు ఉయ్యాలలూగుతున్నారు.

''పాపం... పిల్లలు ఆడుకోవడానికి మనింటి దగ్గర ఏ పార్కూ లేదండీ! పిచ్చి వెధవలు... అలా ఇంటి ముందే ఆడుకుంటారు'' అంది సరళ ఆ పిల్లల్ని చూస్తూ.

''చిన్నాడికి జలుబు తగ్గిందా? మందు గుర్తుంచుకుని మధ్యాహ్నం వేసావా లేదా?'' అనడిగాడు ఆనందరావు.

''వేసాను. కానీ ఇంకాస్త ఉంది. అమ్మకి రాత్రి కూడా వేయమని చెప్పాను.''

మరి కాసేపు పిల్లల చదువుల గురించి, వారి అవసరాల గురించి మాట్లాడుకున్నాక ఇంటికి బయల్దేరారు.

''ఏంఒయ్! ఎలా ఉంది? రాత్రికి రెడీగా ఉన్నావా? నాకైతే చాలా టెంప్టింగా వుంది. ఏం చేస్తావో మరి...''

''తినబోతూ రుచులెందుకు? నేనెప్పుడూ వెనక్కి తగ్గినట్లు నాకు గుర్తులేదు.'' భర్తకి తీసిపోకుండా సమాధానం చెప్పింది సరళ.

త్రోవలో వాచీ చూస్కుంటే ఎనిమిదిన్నర అయింది. కొడుకు గుర్తుకి వచ్చాడామెకి. వాడికి అన్నం తినే టైమ్, ఒక్క అయిదు నిమిషాలు లేటయినా మరి సరిగ్గా తినడు. అమ్మ పెట్టిందో లేదో. పెట్టినా గొడవ చెయ్యకుండా తింటున్నారో లేదో. రాత్రి సరిగ్గా అన్నం తినకపోతే అర్ధరాత్రి ఆకలేస్తుంది వాడికి. అప్పుడు లేచి తినడానికి ఏదైనా అడుగుతాడు. బిస్కట్లయినా ఉంచి రావల్సింది.

హఠాత్తుగా మౌనంగా అయిపోయిన భార్యని పలకరించాడు ఆనందరావు. ''ఏమిటోయ్! ఆలోచనల్లో పడ్డావు? మన పెళ్ళినాటి రోజులు గుర్తుకి వస్తున్నాయా?''

''అది కాదండీ! చంటాడికి అన్నంతినే టైమ్ అయింది కదా!'' అనేసి నాలుక్కరుచుకుంది.

క్షణంపాటు గిల్టీగా ఫీలయ్యాడు ఆనందరావు. తాను కేవలం మగవాడిలా ఆలోచిస్తుంటే ఆమె తల్లిలా ఆలోచిస్తున్నది. అదే ఆడదానికీ మగవాడికీ తేడా!

''మీ అమ్మగారు చూస్కుంటార్లే. ఫర్వాలేదు. వర్రీ అవకు...'' అని చెప్పాడే కానీ తిరిగి తినడానికి వాడు చేసే అల్లరి గుర్తుకు వచ్చేసరికి అతడిక్కూడా అన్పించింది ఏం చేస్తున్నాడో అని.


ఇద్దరూ ఇంటికి చేరారు.

తాళం తీయగానే పిల్లల్లేని ఇల్లు నిశ్శబ్దంగా బోసిగా తోచింది. ఎప్పుడు వాళ్ళతో బయటికి వెళ్ళినా వాళ్ళకోసం కొనుక్కొన చిన్న చిన్న వస్తువులు పట్టుకుని కేరింతలు కొడుతూ లోపలికి వచ్చేవారు.

అలాకాక తను ఆఫీస్ నుంచి వస్తే ముగ్గురూ ఒక్కసారి వచ్చి చుట్టుకుపోయేవారు. ఎందుకనోగానీ ఎంత అలసటతో ఆఫీస్ నుంచి వచ్చినా వాళ్ళొచ్చి అలా ఒళ్ళో కూర్చోగానే తృప్తిగా అన్పించేది. అలాంటిది ఈరోజు నిశ్శబ్దమైన ఇంట్లో అడుగుపెడుతుంటే దిగులుగా అన్పించింది భార్యాభర్తలిద్దరికీ.

అయినా ఎవరి ఫీలింగ్స్ వారు దాచుకున్నారు. బయటపడితే రెండోవాళ్ళెక్కడ హర్ట్ అవుతారో అని. మౌనంగా బట్టలు మార్చుకున్నాడు ఆనందరావు.

బెడ్‌రూమ్‌లో మంచం మీద తన పాత తెల్లచీర ఇస్త్రీ చేసి పరిచి దాన్నిండా



## ముగ్గురి ఫైన్

ఇద్దరు పురోహితులు స్కూటర్ మీద శర వేగంతో వెళ్తున్నారు. వారిని ట్రాఫిక్ పోలీస్ ఆపాడు.
''మీరు చాలా స్పీడుగా వెళ్తున్నారు. అంత స్పీడ్‌గా వెళ్తే మీకు ఫైన్ పడుతుందని తెలుసుగదా?'' అన్నాడు.
''మాకేమీ భయం లేదు. దేవుడు మాతోనే వున్నాడు'' అన్నాడు ఒక పురోహితుడు.
కానిస్టేబుల్‌కు ఫ్రిరెత్తింది. ''అలాగా! అయితే మీరు ఫైన్ కట్టాల్సిందే. రెండు చక్రాల బండిమీద ముగ్గురు ప్రయాణం చెయ్యకూడదు!'' అని చెప్పాడు- జేబులో నుంచి రశీదు బుక్ తీస్తూ.


## ఫిమెయిల్

ఓ సింగ్‌గారు రైల్వే స్టేషన్లో క్యూలో నిలబడి వున్నాడు టిక్కెట్ కోసం. ఆయనగారి ముందు మరో ఇద్దరు న్నారు. సింగ్‌గారి ముందున్న వ్యక్తి ''నాకొక పంజాబ్ మెయిల్‌కు ఇవ్వండి'' అని అడిగాడు. క్లర్క్ అతనికి టిక్కెట్ ఇచ్చాడు.
సింగ్ కౌంటర్ ముందుకు రాగానే ''ఒక పంజాబ్ మెయిల్, ఒక పంజాబ్ ఫిమేల్ టికెట్ ఇవ్వండి!'' సింగ్ అన్నాడు.
''పంజాబ్ ఫిమేల్ అంటున్నావేమిటి?'' క్లర్క్ కోపంగా అన్నాడు.
''అది నా భార్యకు!'' చెప్పాడు సింగ్‌గారు.

## వహ్వా.. టీ!

''టీ ఇలా వుందేమిటయ్యా'' అరిచాడు అప్పారావ్.
''భలేవారే సార్. ఈ టీని డార్జిలింగ్ నుంచి తెప్పించాం!'' చెప్పాడు సర్వర్.
''అంతదూరం నుంచా. అందుకే అంత చల్లగా ఏడ్చింది'' విసుక్కున్నాడు అప్పారావు.

-కొడిమెల




గులాబీరేకులు, కనకాంబరాలు, కాసిన్ని మల్లెమొగ్గలు కలిపి చల్లి ఉంచింది సరళ. ఆ పాన్పెంతో అందంగా మొదటిరాత్రిని తలపుకి తెస్తోంది. గదిలో ఓ మూలనుంచి అగరొత్తుల వాసన మధురంగా గదంతా పరుచుకుంది. టేబుల్ మీద చిన్న గాజుగ్లాసులో పాలు...

చాలా చిత్రంగా- ఆ ఏర్పాట్లేవీ కూడా ఆనందరావు మనస్సుని రంజింపచేయడం లేదు.

మనస్సులో ఏమిటో ఎందుకో ఒక వెలితిలా ఉంది! యాంత్రికంగా పక్కచేరాడు. సరళ వచ్చి అతడిపక్కనే పడుక్కుని మెడచుట్టూ చెయ్యి వేసింది.

ఆమె తలపైనుంచి భుజాలను చుట్టూ చేయి వేసి మరి కాస్త దగ్గరగా తీస్కున్నాడు.

ఇద్దరూ కాసేపు మౌనంగా ఉండిపోయారు.

ఎన్నాళ్ళగానో కోరుకున్న ఏకాంతం, అవకాశం ఈరోజు దొరికినా ఇద్దరికీ కూడా ఏమీ తోచనట్లుగా ఉంది.

ముఖ్యంగా ఆనందరావుకి- ఆఖరుది నిద్రపోయే ముందు ఓపావుగంట తండ్రి గుండెల మీద ఆడుకుంటుంది ప్రతిరోజూ.

ఏరోజైనా ఆనందరావుకి రావడం లేట్ అయితే తన టైమ్‌కి నిద్రపోయినా ఒక గంట తర్వాత మళ్ళీ లేస్తుంది. ఆ టైమ్‌కి తండ్రి కన్పిస్తే కాసేపు ఆడుకుని మళ్ళీ పడుక్కుంటుంది.

అలాంటిది ఈరోజు అది లేకపోవడం ఏమిటోగా అన్పిస్తుంది. దాని చిన్న చిన్న చేతుల స్పర్శ గుర్తుకి వస్తోంది!

ఇకపోతే సరళ ఆలోచనల్లో కొడుకు వదిలిపోవడం లేదు. తల్లి పనంతా అయిపోయేవరకూ ఓపిగ్గా ఎదురుచూస్తాడు వాడు.

ఆ తర్వాత వాడిపక్కన పడుక్కుని కాకి-నక్క కథ దగ్గర్నుంచి కరెంట్ ఎఫైయిర్స్ వరకూ అన్నీ చెప్పాక గానీ నిద్రపోడు.

భార్యాభర్తలిద్దరూ ఎవరి ఆలోచనల్లో వారు మునిగిపోయి ఉన్నవాళ్ళల్లా సడన్‌గా ఇద్దరూ ఒకరినొకరు చూస్కున్నారు. ''ఏమిటి ఆలోచిస్తున్నావు? ఏమిటి ఆలోచిస్తున్నారు?'' అన్న ప్రశ్నలు డ్యూయెట్‌లా వారి నోటి నుంచి వచ్చాయి.

ఇద్దరికీ నవ్వొచ్చింది.

''ఏమిటో... పిల్లల్లేకపోతే ఇల్లు బాగా లేదు కదూ!'' అన్నాడు ఆనందరావు.

''అవును... ముఖ్యంగా రోజంతా వాళ్ళక్కడ ఉన్నా రాత్రి వాళ్ళు లేకుండా ఉండటం ఎప్పుడూ జరగలేదు.''

ఆనందరావు లేచి కూర్చున్నాడు. ''పద... వెళ్ళి తీసుకువచ్చేద్దాం.''

తదేకంగా భర్త ముఖంలోకి చూసింది సరళ.

''ప్లీజ్... ఈ ఏకాంతాన్ని మనం ఎంజాయ్ చేయలేము సరళా! ఇన్నాళ్ళూ మనకీమాత్రం అవకాశం దొరకలేదు కనుక దీనికోసం తపించిపోయాము. ఈరోజు ఇంతటి ఏకాంతంలో మనిద్దరం కూడా తృప్తిగా లేము. మన తృప్తి దేనితో ఉందో తెలిసింది... పద, వెళ్ళి పిల్లల్ని తెచ్చేస్కుందాం.''

సరళకెందుకో కళ్ళు చెమర్చాయి.

అర్థరాత్రి కాలింగ్‌బెల్ శబ్దానికి తలుపు తీసిన సరళ తల్లి ఎదురుగా కూతురినీ అల్లుడినీ చూసి ఆశ్చర్యపోయింది.

''ఇదేమిట్రా ఈ టైమ్‌లో వచ్చారు? ఫోన్ రావడం మంచిది అయింది...'' అంది నవ్వుతూ.

సరళకి అర్థం కాలేదు. లోపలకి వచ్చేసరికి చిన్నపిల్లలిద్దరూ పడుక్కుని ఉన్నారు. పెద్దది కన్పించలేదు.

''పాపనేదమ్మా!'' అనడిగింది తల్లిని.

''అదిగో... అని చూపించిందామె. అక్కడ ఓ మూల చాప మీద పడుక్కుని ఉంది.

సంభ్రమంగా చూసింది సరళ.

''రాత్రే చాపెక్కింది. నీకు ఫోన్ చేస్తే మీరు లేరని చెప్పారు మీ ఇంటిగలవాళ్ళు. అప్పటికప్పుడు ఓ ముగ్గురు ముత్తయిదువలని పిలిచి కూర్చోపెట్టాను.''

సరళ కూతురి దగ్గరగా వెళ్ళి తల నిమిరింది.

తల్లిదండ్రుల గొంతు విని చిన్నవాళ్ళు కూడా లేచారు. చంటిది తండ్రిని చూడగానే చాటంత ముఖం చేస్కుని వెళ్ళి వాటేస్కుంది.

కూతురిని లేపి చీరకొంగు భుజం చుట్టూ కప్పింది సరళ.

''మేము వెళ్ళొస్తాం అమ్మా! మీరు పడుక్కోండి...'' అంది.

''ఈ రాత్రప్పుడు ఎందుకే? అయినా ఓ రెండు రోజులు పిల్లల్ని ఉంచుతానన్నావుగా?''

''లేదమ్మా! వీళ్ళు లేకపోతే మాకేతోచడం లేదు.'' అని బయటకి దారితీసింది.

పిల్లల్ని అపురూపంగా పట్టుకుని వెళ్తున్న ఆ జంటకేసి వింతగా చూస్తూ ఉండిపోయిందావిడ.

★